సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 21 । మార్చి । 2025


I



రోడ్డెక్కకుండా చూడండి

నీటి సమస్య పెరగకముందే అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్ సూచించారు.

- IIలో ▸



గరిష్టం/కనిష్టం
39.7 /19.7

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

ధాన్యం సేకరణకు వేళాయె!

- జిల్లాలో 2.61 లక్షల ఎకరాల్లో వరి సాగు
- 5.63 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం
- 424 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం
- ఏర్పాట్లు చేస్తున్న జిల్లా యంత్రాంగం



కామారెడ్డి క్రైం : యాసంగి సీజన్‌కు సంబంధించిన వరి ధాన్యం సేకరణకు వేళయ్యింది. ముందుగా నాట్లు వేసిన ప్రాంతాలలో వరి కోతలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ధాన్యం సేకరణకు జిల్లా యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. జిల్లావ్యాప్తంగా 424 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించిన అధికారులు.. ఆ దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాలో యాసంగి సీజన్‌లో 2,61,110 ఎకరాల్లో వరి సాగయ్యింది. ఇందులో దొడ్డు రకం వరి ధాన్యాన్ని 2,03,665 ఎకరాల్లో, సన్నరకం 57,445 ఎకరాల్లో సాగు చేశారు. 4,88,796 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం, 1,32,121 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం దిగుబడి వచ్చే అవకాశాలున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. మొత్తం మీద 6,10,917 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రావచ్చని భావిస్తున్నారు. ఇందులో నుంచి రైతుల ఇంటి అవసరాలకుపోను కొనుగోలు కేంద్రాలకు 5.63 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశాలున్నాయని అంచనా వేసిన అధికారులు.. ఆ మేరకు ధాన్యాన్ని సేకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, గన్నీ బ్యాగులు, టార్పాలిన్‌లు, తూకం యంత్రాలు, ప్యాడీ క్లీనర్‌లు, ఇతర సామగ్రితోపాటు మౌలిక సదుపాయాలను సమకూర్చే పనిలో ఉన్నారు. 1.40 కోట్ల గన్నీ సంచులు అవసరం ఉండగా ప్రస్తుతం 12.18 లక్షలు అందుబాటులో ఉన్నాయి. మిగతావి ఎప్పటికప్పుడు తెప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సింగిల్ విండోలు, ఐకేపీ ఆధ్వర్యంలో..

యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యం సేకరణకు జిల్లాలో 424 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో 397 కేంద్రాలను సింగిల్ విండో ఆధ్వర్యంలో, 27 కేంద్రాలను ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తారు. వీటిలో 63 కేంద్రాలలో కేవలం సన్న రకం ధాన్యం సేకరిస్తారు. గ్రేడ్- ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ. 2,320, సాధారణ రకానికి రూ. 2,300 మద్దతు ధర చెల్లిస్తారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఇటీవల సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై దిశానిర్దేశం చేశారు. త్వరలోనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని, అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని సూచించారు.

నీరందక దిగుబడులపై ప్రభావం..

యాసంగి సీజన్ ప్రారంభంలో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండడంతో రైతులు వరి సాగుకు ఆసక్తి చూపారు. దీంతో జిల్లావ్యాప్తంగా 2,61,110 ఎకరాల్లో వరి సాగయ్యింది. అయితే ఎండలు ముదురుతుండడంతో కొద్ది రోజులుగా భూగర్భ జలాలు పడిపోతున్నాయి. దీంతో బోరుబావులు ఎత్తిపోతుండడంతో సాగు నీటికి తిప్పలు తప్పడం లేదు. నిజాంసాగర్ ఆయకట్టు ప్రాంతమైన బాన్సువాడ రూరల్ తదితర ప్రాంతాల్లోని చివరి ఆయకట్టు ప్రాంతాలకు నీరందే పరిస్థితి లేకుండా పోయింది. నీరందక పంటలు ఎండుముఖం పడుతుండడంతో ఈసారి ఆశించిన స్థాయిలో దిగుబడులు రాకపోవచ్చని భావిస్తున్నారు.

“ ఏర్పాట్లు చేస్తున్నాం



జిల్లాలో 5.63 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రావొచ్చని అంచనాలు వేశాం. ఇందుకు అనుగుణంగా 424 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– రాజేందర్, డీఎం, సివిల్ సప్లయ్ కార్పొరేషన్, కామారెడ్డి



రాజంపేట సెంటర్‌లో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

నేటినుంచి పదో తరగతి పరీక్షలు

నిజాంసాగర్/కామారెడ్డి టౌన్ : జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. శుక్రవారం ప్రారంభమయ్యే పరీక్షలు వచ్చేనెల 4వ తేదీ వరకు కొనసాగనున్నాయి. రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. జిల్లాలో 12,579 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో బాలురు 6,127 మంది, బాలికలు 6,452 మంది ఉన్నారు. వీరికోసం 64 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అధికారులు ఇప్పటికే పరీక్ష కేంద్రాలలో అవసరమైన వసతులు కల్పించారు.

పరీక్ష కేంద్రాల వద్ద భారీ బందోబస్తు

కామారెడ్డి క్రైం : ఎస్సెస్సీ పరీక్షల కోసం పకడ్బందీగా బందోబస్తు ఏర్పాట్లు చేశామని ఎస్పీ రాజేశ్ చంద్ర గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. జిల్లాలోని 64 పరీక్ష కేంద్రాల వద్ద పరీక్షల సమయంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. కేంద్రాలకు 200 మీటర్ల వరకు ఎవరూ గుమికూడి ఉండకూడదని తెలిపారు. పరిసర ప్రాంతాల్లో ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైకులు, డీజేలతో ఊరేగింపులకు అనుమతులు ఉండవని స్పష్టం చేశారు. పరీక్ష జరిగే సమయంలో సమీపంలోని ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ దుకాణాలను మూసి ఉంచాలని సూచించారు. పట్టణంలో విద్యార్థులకు ఎలాంటి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు పెట్రోలింగ్ పార్టీలు గస్తీ నిర్వహిస్తాయని పేర్కొన్నారు. ఏదైనా అత్యవసరం అయితే ప్రజలు డయల్ 100 ను వినియోగించుకోవాలని సూచించారు.



ముగిసిన ఇంటర్ పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు గురువారం ముగిశాయి. చివరిరోజు నిర్వహించిన సెకండియర్ పరీక్షకు 8,021 మందికిగాను 7,822 మంది విద్యార్థులు హాజరయ్యారు. 199 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు సంతోషంగా పరీక్ష కేంద్రాల నుంచి బయటకు వచ్చారు.

న్యూస్‌రీల్

చల్లని కబురు

- నేడు, రేపు వర్షం కురిసే అవకాశం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: వేసవి ప్రారంభంలోనే గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరడంతో ఇబ్బందిపడుతున్న ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురందించింది. శుక్ర, శని వారాల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన వాన కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రెండు రోజుల పాటు వర్షం కురిసే అవకాశాలున్నాయి. అయితే వడగళ్లు పడే అవకాశాలు ఉన్నందున రైతులు చెట్ల కింద ఉండవద్దని అధికారులు సూచిస్తున్నారు.

పీజీ ఫస్ట్ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (స్వయం ప్రతిపత్తి) పీజీ ప్రథమ సంవత్సరం(రెగ్యులర్) మొదటి సెమిస్టర్ ఫలితాలను గురువారం ప్రకటించారు. తెలంగాణ విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ సంపత్‌కుమార్, కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, కళాశాల పరీక్షల కంట్రోలర్ కిష్టయ్య ఫలితాలను విడుదల చేశారు. కార్యక్రమంలో తెయూ అడిషనల్ కంట్రోలర్లు సంపత్, రాములు, రాజేందర్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి టౌన్ : జిల్లాలో వైద్య విధాన పరిషత్ పరిధిలోగల వివిధ ప్రభుత్వ ఆస్పత్రులలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయనున్నారు. గైనకాలజిస్ట్, అనస్తీషియాలజిస్ట్, ఆర్థోపెడిక్, రేడియాలాజిస్ట్, ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేయనున్నామని డీసీహెచ్‌ఎస్ విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పోస్టులకు ఆసక్తిగల వైద్యులు దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు జిల్లా కేంద్రంలోని డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

‘మున్సిపాలిటీలో కలపొద్దు’

బిచ్కుంద: తమ గ్రామాన్ని కొత్తగా ఏర్పాటు చేయబోయే బిచ్కుంద మున్సిపాలిటీలో కలపవద్దని గోపన్‌పల్లివాసులు కోరారు. బిచ్కుందతోపాటు గోపన్‌పల్లి, దౌల్తాపూర్‌లతో కలిపి బిచ్కుంద మున్సిపాలిటీ ఏర్పాటు చేయాలని అధికారులు కొన్నాళ్ల క్రితం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. గోపన్‌పల్లి గ్రామ ప్రజలు గురువారం చావడి వద్ద సమావేశమై చర్చించారు. తమ గ్రామాన్ని పంచాయతీగానే ఉంచాలని తీర్మానం చేశారు. గ్రామాన్ని బల్దియాలో కలిపితే పన్నులు పెరుగుతాయని, ఉపాధి హామీ పనులకు దూరం కావాల్సి వస్తుందని వారు పేర్కొన్నారు. ప్రజల అభిప్రాయాలను తీసుకోకుండా అధికారులు ప్రతిపాదనలు పంపడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపాదనలను వెనక్కి తీసుకోకపోతే తహసీల్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రీజియన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ ఆర్టీసీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్‌ఎం జ్యోత్స్న తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రయాణికులు సమస్యలు, సూచనలను తెలపాలని కోరారు.

రీజినల్ మేనేజర్, నిజామాబాద్ 9959226011
డిపో మేనేజర్, కామారెడ్డి 9959226018

ఇందూరు తిరుమల బ్రహ్మోత్సవాలు ప్రారంభం



మోపాల్: నర్సింగపల్లిలోని ఇందూరు తిరుమలలో బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. గంగోత్రి రామానుజ దాసు స్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. బ్రహ్మోత్సవాలంటే అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు వేంకటేశ్వర స్వామికి చాలా ఇష్టమని, లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు అంటే స్వామికి అత్యంత ప్రీతికరమని గంగోత్రి స్వామి పేర్కొన్నారు. ఇందూరు తిరుమలలో బ్రహ్మోత్సవాలను కనులపండువగా నిర్వహించడం ఈ ప్రాంతానికి సుభిక్షమన్నారు. ఆలయ ధర్మకర్తలు నర్సింహారెడ్డి, విజయసింహారెడ్డి, యజ్ఞాచార్యులు శ్రీమన్నారాయణ శిఖామణి, శ్రీఖరాచార్యులు, సంపత్ కుమారాచార్య, రోహిత్ కుమారాచార్య, ఆచార్య నరసింహమూర్తి, శ్రీధరాచార్య, నర్సారెడ్డి, నరాల సుధాకర్, సురేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో దంపతుల హల్‌చల్

- ‘సమాచారం’ ఇవ్వడం లేదని ఆరోపణ
- పురుగుల మందు డబ్బాతో ఆందోళన



భార్యాభర్తల నుంచి పురుగుల మందు డబ్బాను లాక్కున్న కానిస్టేబుల్

కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో గురువారం ఓ జంట హల్‌చల్ చేసింది. వివరాలిలా ఉన్నాయి. తాడ్వాయి మండలం చిట్యాల గ్రామానికి చెందిన పులి స్వప్నకు 2022లో సిజేరియన్ ఆపరేషన్ అయ్యింది. అయితే వైద్యులు సరిగ్గా కుట్లు వేయకపోవడంతో ఆమె ఇబ్బంది పడింది. పలుమార్లు అనారోగ్యానికి గురికావడంతో 2023 నవంబర్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లగా ఆపరేషన్ చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో తన భార్యకు ఆపరేషన్ చేసిన వైద్యులెవరనే సమాచారం కోసం ఆమె భర్త ప్రభాకర్ సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేశాడు. అయితే 14 నెలలు గడుస్తున్నా ఆస్పత్రి సిబ్బంది సమాచారం ఇవ్వకపోవడంతో 20 రోజుల క్రితం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సమాచారం ఇవ్వకుండా ఆస్పత్రి సిబ్బంది ఇంకా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ గురువారం ఆ దంపతులు పురుగుల మందు డబ్బా తీసుకుని ఆస్పత్రిలోని కార్యాలయానికి వచ్చి ఆందోళన చేశారు. ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ లక్ష్మణ్‌రావు దీనిని గమనించి వారి వద్దనుంచి పురుగుల మందు డబ్బాను లాక్కొని, వారిని సముదాయించారు. దీంతో భార్యాభర్తలు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

సాధారణ కాన్పులు పెంచాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం : ప్రభుత్వ ఆస్పత్రులలో సాధారణ కాన్పులకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్యులు, ఇతర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు పెరగాలన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు నిర్వహిస్తూ జిల్లా జనరల్ ఆస్పత్రిలో రద్దీ తగ్గేలా చూడాలన్నారు. వడదెబ్బ బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని, మండలాల వారీగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా సమయ పాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, ప్రోగ్రాం అధికారులు శిరీష, రాధిక, విద్య, ప్రభు కిరణ్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు



రోదిస్తున్న మృతుడి భార్య, కుటుంబ సభ్యులు, ఇన్‌సెట్‌లో మృతుడు రవికుమార్ (ఫైల్)

- విధుల్లో ఉన్న పోలీసులను ఢీకొన్న కారు
- ఓ కానిస్టేబుల్ మృతి, మరో కానిస్టేబుల్‌కు స్వల్ప గాయాలు
- గాంధారిలో వేకువజామున కలకలం రేపిన ఘటన

కామారెడ్డి క్రైం/గాంధారి : తెల్లవారుజామున గాంధారి నడిబొడ్డున అదుపుతప్పిన ఓ కారు బీభత్సం సృష్టించింది. బీట్ విధులు నిర్వహిస్తున్న పోలీసులపైకి మృత్యువు రూపంలో దూసుకువెళ్లింది. ఈ ఘటనలో ఓ కానిస్టేబుల్ అక్కడికక్కడే మరణించగా మరొకరు గాయాలతో బయటపడ్డారు. గురువారం వేకువజామున 3 గంటల ప్రాంతంలో జరిగిన వివరాలిలా ఉన్నాయి. గాంధారి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు వడ్ల రవికుమార్ (35) సుభాష్ గురువారం వేకువజామున 3 గంటల ప్రాంతంలో హనుమాన్ టిఫిన్ సెంటర్ ఎదురుగా బీట్ డ్యూటీ నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో కామారెడ్డి వైపు నుంచి బాన్సువాడ వైపు వెళ్తున్న ఓ కారు అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి బీభత్సం సృష్టించింది. కారు ఢీకొనడంతో రవికుమార్ అక్కడికక్కడే మరణించాడు. కారు ప్రమాదకరంగా రావడాన్ని సెకండ్ల వ్యవధిలో గమనించిన మరో కానిస్టేబుల్ సుభాష్ వేగంగా పక్కకు దూకడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కారు నడుపుతూ ప్రమాదానికి కారణమైన సన్నిత్‌కు సైతం గాయాలు కావడంతో అతడిని ఆస్పత్రికి తరలించారు. అతడిని స్థానిక ఆర్‌ఎంపీ కుమారుడిగా గుర్తించారు. వాహనం నడుపుతున్న సమయంలో మద్యం మత్తులో ఉండవచ్చని భావిస్తున్నారు.

మిన్నంటిన రోదనలు..

తాడ్వాయి మండలం దేమె గ్రామానికి చెందిన కానిస్టేబుల్ రవికుమార్ కుటుంబం కొంత కాలం క్రితం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో స్థిరపడింది. 2007 బ్యాచ్‌కు చెందిన రవి కుమార్.. జిల్లా పోలీసు కార్యాలయంలోని స్పెషల్ బ్రాంచ్ విభాగంలో విధులు నిర్వహించి ఇటీవలే గాంధారికి బదిలీ అయ్యాడు. మృతుడికి భార్య సౌఖ్య, కూతుళ్లు రసజ్ఞ, రవిజ్ఞ, కుమారుడు రితేష్ చంద్ర ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కయిన రవికుమార్ అకాల మరణం అతని కుటుబంలో తీరని విషాదాన్ని నింపింది. పోస్టుమార్టం నిర్వహించే జనరల్ ఆస్పత్రికి కుటుంబ సభ్యులు, బంధువులు భారీగా తరలివచ్చారు. పోస్టుమార్టం అనంతరం కానిస్టేబుల్ రవి కుమార్ అంత్యక్రియలను పోలీసు లాంఛనాలతో దేవునిపల్లిలో నిర్వహించారు. అంత్యక్రియల్లో ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ రావు, సీఐ సంతోష్ కుమార్, పలువురు ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

కాగా కారు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో సమీపంలోని దుకాణాల సామగ్రి, బోర్డులు, మెట్లకు ఉండే రెయిలింగ్ చిందరవందర అయ్యాయి. ఎస్సై ఆంజనేయులు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. కానిస్టేబుల్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

కానిస్టేబుల్ రవికుమార్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని ఎస్పీ రాజేశ్ చంద్ర పేర్కొన్నారు. కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వద్ద రవికుమార్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



కానిస్టేబుల్ తల్లిని ఓదారుస్తున్న ఎస్పీ రాజేశ్‌చంద్ర

మద్యం మత్తు.. యువత చిత్తు

- మందు, విందుల్లో మునిగి తేలుతున్న యువకులు
- డ్రంకెన్ డ్రైవ్‌తో రోడ్డు ప్రమాదాలు
- తాగి దారుణాలకు పాల్పడుతున్న పలువురు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : సరదాగా అలవాటైన మద్యపానం.. వ్యసనంగా మారి జీవితాలను నాశనం చేస్తోంది. హత్యలు, అత్యాచారాలు, రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా మద్యం మత్తులోనే జరుగుతున్నాయి. నలుగురు స్నేహితులు కలిస్తే చాలు మందు కొనడం, ఎక్కడో ఒకచోట కూర్చుని జల్సా చేయడం అలవాటుగా మారింది. తాగిన మైకంలో కొందరు నేరాలకు పాల్పడుతున్నారు. మత్తులో తూలుతూనే బైకులు, కార్లు నడుపుతూ రోడ్లపై వెళ్లే వారిని ఇబ్బంది పెడుతున్నారు. కొన్ని సందర్భాల్లో తాగి వాహనాలు నడిపేవారి మూలంగా ఇతరులు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోంది. తమ జల్సాకు డబ్బులు లేకుంటే దొంగతనాలకూ పాల్పడుతున్నారు. మరికొందరు గంజాయి దందాలోనూ దిగుతున్నారు. ఇటీవల దేవునిపల్లి, భిక్కనూరు పోలీసు స్టేషన్ల పరిధిలో పోలీసులకు చిక్కిన గంజాయి ముఠాలో స్థానికంగా ఉన్న యువకులే మత్తుకు అలవాటు పడి గంజాయి దందాలో దిగినట్టు తేలింది. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడుతున్న వారికి జరిమానాలు, జైలు శిక్షలు పడుతున్నా మార్పు రావడం లేదు.

మత్తే కారణం...

జిల్లాలో రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్లే జరుగుతున్నట్టు తెలుస్తోంది. గతేడాది జిల్లాలో 513 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఇందులో 258 మంది మరణించగా 255 మంది గాయపడ్డారు. అన్ని రూట్లలో పోలీసులు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ, తాగి వాహనాలు నడిపేవారికి జరిమానాలు విధిస్తున్నా మార్పు రావడం లేదు.



గతేడాది జిల్లాలో 38 హత్యలు జరిగాయి. ఇందులో చాలా వరకు మత్తులో ఆవేశంతో చేసినవే ఉన్నాయి. 60 వరకు రేప్ కేసులు నమోదయ్యాయి. మత్తులో ఏం చేస్తున్నామన్న విచక్షణ కోల్పోయినవారు అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. కొన్ని కేసుల్లో తోడబుట్టిన వాళ్లు, కన్నవాళ్లు, ఇతర రక్తసంబంధీకులు, బంధువులే నిందితులుగా ఉంటుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇదే సమయంలో వివాహేతర సంబంధాల నేపథ్యంలో జరిగిన హత్యలన్నింటిలోనూ నిందితులు మత్తులో ఉన్నట్లు తేలుతోంది. ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనల్లోనూ మద్యం మత్తులో కుటుంబ సభ్యులతో గొడవలు పడి చేసుకుంటున్నవే ఎక్కువగా ఉంటున్నాయి.

పెరిగిన గంజాయి సేవనం..

యువత మత్తు కోసం గంజాయికి అలవాటు పడుతోంది. చిన్న చిన్న పొట్లాల రూపంలో అందుబాటులోకి రావడంతో కొనుగోలు చేసి సిగరెట్లల్లో నింపేసి పీలుస్తున్నారు. ఒకసారి అలవాటు పడిన వాడు నిరంతరం అదే మత్తును కోరుకుంటున్నాడు. గంజాయికి అలవాటు పడినవారు కొందరు.. గంజాయి ఎక్కడ దొరుకుతుందో మూలాలు కనుక్కొని దందా నడుపుతున్నారు. ఇటీవల పోలీసులకు చిక్కిన ముఠాలన్నీ మత్తుకు అలవాటు పడి దందాలో దిగినట్టు వెల్లడైంది. బెల్ట్ షాప్‌లు, గంజాయి దందాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.

విచ్చలవిడిగా అమ్మకాలు..

జిల్లాలో తాగు నీరు దొరకని గ్రామాలున్నాయి గానీ మద్యం దొరకని ఊళ్లు లేవు. ఊరూరా బెల్టు షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. కొన్ని ఊళ్లలో వేలం పాటలు కూడా నిర్వహిస్తున్నారు. పట్టణాల్లో కూడా గల్లీగల్లీలో మద్యం అమ్మకాలు నడుస్తున్నాయి. అర్ధరాత్రి, అపరాత్రి కూడా మద్యం దొరుకుతోంది. కొన్ని గ్రామాల్లో అయితే ఫోన్ చేస్తే చాలు మద్యం డోర్ డెలివరీ చేస్తున్నారు. మరొకొన్ని గ్రామాల్లో బెల్టు షాపులు ప్రత్యేకంగా షెడ్లు వేసి, అక్కడ కూర్చుని మద్యం సేవించేందుకు కుర్చీలు, టేబుళ్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఆఫీసర్ లోపల.. బయట తాళం

- ఆర్అండ్బీ గెస్ట్హౌస్కు తాళం వేసిన మతిస్థిమితం లేని వ్యక్తి


డోరు తాళం పగలగొడుతున్న సిబ్బంది

కామారెడ్డి టౌన్: ప్రభుత్వ అతిథి గృహంలో అధికారి విశ్రాంతి తీసుకుంటుండగా, మతిస్థిమితం లేని వ్యక్తి బయట నుంచి తాళం వేసి వెళ్లిన ఘటన గురువారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. కామారెడ్డి ఆర్అండ్బీ అతిథి గృహంలో బుధవారం రాత్రి విద్యుత్ శాఖకు సంబంధించిన ఒక అధికారి విశ్రాంతి తీసుకున్నారు. గెస్ట్హౌస్ సిబ్బంది వస్తే ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు లోపల నుంచి గొళ్లెం పెట్టకుండా తాళం సోఫాపై పెట్టి విశ్రాంతి తీసుకున్నారు. గురువారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు పైఅంతస్తులోకి వెళ్లగా అదే సమయంలో ఓ మతిస్థిమితం లేని వ్యక్తి నేరుగా గెస్ట్హౌస్ లోపలికి వచ్చి సోఫాపై ఉన్న తాళం తీసుకుని డోర్కు తాళం వేసి వెళ్లిపోయాడు. కాసేపటికి కిందికి వచ్చిన అధికారి.. డోర్కు బయటి నుంచి తాళం వేసి ఉండడంతో కంగుతిన్నాడు. సిబ్బందికి ఫోన్ చేయగా, సుమారు గంటపాటు శ్రమించి తాళం తీశారు.

తాగునీటి కోసం తండ్లాట



మాచారెడ్డి : మండలంలోని మైసమ్మచెరువు గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న దుర్గమ్మగుడి తండాలో తాగునీటి కోసం తండ్లాడుతున్నారు. 25 కుటుంబాలు నివసిస్తున్న తండాలో ఉన్న ఒక్క బోరు వట్టిపోయింది. దీంతో ఆ తండా వాసులు కిలోమీటరు దూరంలో ఉన్న పంట చేల నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. నిత్యం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, కొందరు పంట చేలకు రానీయడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తండాలో నెలకొన్ని నీటి ఎద్దడిని తీర్చాలని కోరారు.

వాహనాల తనిఖీ

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ బైపాస్ వద్ద దేవునిపల్లి పోలీసులు గురువారం విస్తృతంగా వాహనాల తనిఖీల చేపట్టారు. పాత ఫైన్లు వసూలు చేయడంతో పాటు వాహనదారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా దేవునిపల్లి ఎస్సై రాజు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీట్ బెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు. స్పీడ్గన్ ఉందనీ, నిర్ణీత వేగం దాటితే జరిమానాలు తప్పవన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నిజాంసాగర్(జుక్కల్): సైబర్ నేరాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శివకుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మహిళా సమాఖ్య సమావే శంలో ఆయన మాట్లాడారు. మానవ అభివృద్ధి విభాగంలో మానవ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారం నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు దుద్దె. అనిత, ఐకేపీ ఏపీఎం రాంనారాయణగౌడ్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ రాజేశ్వరి తదితరులున్నారు.

ప్రజలు రోడ్డెక్కకుండా చూడండి

- నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోండి
- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి క్రైం: నీటి సమస్యలు పెరిగి ప్రజలు రోడ్లపైకి రాకుండా ముందే అధికారులు సమస్యల పరిష్కారం కోసం ముందస్తు చర్యలు చేపట్టాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సూచించారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్యలు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవోలు, ఎంపీడీవోలు, డివిజనల్ పంచాయతీ అధికారులతో సమావేశాన్ని గురువారం కలెక్టరేట్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నీటి సమస్యలతో ప్రజలు రోడ్డెక్కకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తూ ఎప్పటికప్పుడు సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. స్థానిక అవసరాలను బట్టి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. వచ్చే జూన్ వరకు నీటి సమస్యలు ఉండే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో ఉన్న ట్యాంకర్లను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఏవైనా మరమ్మత్తులు ఉంటే చేయించాలని సూచించారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా..

జిల్లా కేంద్రంలో ట్యాంకర్లతో నీటి సరఫరా చేయనున్నట్లు కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. సమావేశంలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ, నియోజకవర్గం లోని 48 గ్రామాల్లో నీటి సమస్యల పరిష్కారాలకు రూ.53.36 లక్షల నిధులు కేటాయించామన్నారు. ఆనిధులతో ఆయా గ్రామాలలో పనులు చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలో 5 కొత్త ట్యాంకర్లను కొనుగోలు చేస్తున్నామని, మరో 3 పాత ట్యాంకర్లతో కలిపి అవసరం ఉన్న ప్రాంతాల్లో నీటి సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు. అవసరమైతే మరో 4 ట్యాంకర్లు కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు వస్తే గ్రామ పంచాయతీ నిధుల నుంచి పనులు చేపట్టాలని, ఇతర నిధులను సైతం సమకూరుస్తామని కలెక్టర్ తెలిపారు. ఎక్కడైనా తాగునీటి ఇబ్బందులు ఏర్పడితే వెంటనే అవసరమైన పనులకు ప్రతిపాదనలు సమర్పించాలని మిషన్ భగీరథ, జిల్లా పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఎంపీడీవోలు, మండల పరిషత్ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి నీటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద మంజూరు చేసిన సీసీ రోడ్ల పనులు ఈ నెలాఖరు లోగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి, మిషన్ భగీరథ ఈఈ రమేష్, డీపీవో మురళి, మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి, ఎంపీడీవోలు, డీపీవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


హాజరైన అధికారులు

ఎమ్మెల్యేను కలిసిన పట్టణ అభివృద్ధి సంఘం సభ్యులు

కామారెడ్డి టౌన్: పట్టణ అభివృద్ధి సంఘం, ఉగాది ఉత్సవ సమితి సభ్యులు గురువారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డిని కలిశారు. ఉగాది ఉత్సవాలకు హాజరుకావాలని ఆహ్వానించారు. అలాగే వీక్లీమార్కెట్లో ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.కార్యక్రమంలో సభ్యులు ముదాం శ్రీనివాస్, బొజ్జ రవీందర్, స్వామి, బాల్రాజు, శ్రీనివాస్, నరేష్ రెడ్డి తదితరులున్నారు.

మానవ అక్రమ రవాణాను అరికడదాం

- మానవ అభివృద్ధి విభాగం డీపీఎం రమేష్బాబు


మాట్లాడుతున్న డీపీఎం రమేష్బాబు

కామారెడ్డి రూరల్: మానవ అక్రమ రవాణాను అరికడదామని మానవ అభివృద్ధి విభాగం డీపీఎం రమేష్బాబు అన్నారు. కామారెడ్డి మండల సమాఖ్య కార్యాలయంలో జిల్లాలోని 8 మండలాల ఐకేపీ ఏపీఎంలకు, సీసీలకు మానవ అక్రమ రవాణా అంశంపై గురువారం శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాలలు అక్రమ రవాణాకు గురవుతున్నట్లు గమనిస్తే డయల్ 100, చైల్డ్లైన్ 1098, ఉమెన్స్ హెల్ప్లైన్ 181 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. మానవ అక్రమ రవాణాపై మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాలకు చెందిన ఏపీఎంలు, సీసీలు, టీవోటీలు రాజేందర్, జగదీష్ కుమార్, శ్రీనివాస్, అన్నపూర్ణ, గీత తదితరులు పాల్గొన్నారు.

ఒక రోజు శిక్షణ కార్యక్రమం

నస్రుల్లాబాద్/దోమకొండ : మానవ అక్రమ రవాణా నిర్మూలనకు అందరూ కృషి చేయాలని దోమకొండ ఐకేపీ రాజు అన్నారు. దోమకొండ మండల సమాఖ్య కార్యాలయంలో, నస్రుల్లాబాద్ ఐకేపీ కార్యాలయంలో గురువారం గ్రామ సంఘాల కార్యకర్తలు, గ్రామ సంఘాల సభ్యులకు మానవ అక్రమ రవాణా నిరోధంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా దోమకొండ ఐకేపీ రాజు, నస్రుల్లాబాద్ ఏపీఎం గంగాధర్ మాట్లాడారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సీసీలు రమేష్, రాజు, రవి, శ్రీనివాస్, సుజాత,నాగరాజకుమారి,హన్మండ్లు, నస్రుల్లాబాద్ మహిళా సంఘం అధ్యక్షురాలు శోభారాణి, గ్రామ సంఘం కార్యకర్తలు, గ్రామ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

తై బజార్ రేట్లు తగ్గించాలని వినతి


వినతిపత్రం అందిస్తున్న వ్యాపారులు

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని వ్యాపారులు గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయానికి తరలివచ్చి ప్రత్యేకాధికారి రాణికి తై బజార్ రేట్లు తగ్గించాలని వినతి పత్రం అందించారు. గ్రామ పంచాయతీ పరిధిలో కురగాయలు, పండ్ల దుకాణాలు ఇతర చిరు వ్యాపారులకు తై బజార్ తగ్గించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో వెంకటనర్సయ్య, పంచాయతీ కార్యదర్శి సందీప్, వ్యాపార సంఘం ఉపాధ్యక్షుడు ఉడుతావార్ సురేష్, పండరి, కార్యదర్శి రచ్చ కుషాల్, కోశాధికారి సంతోష్ వ్యాస్, వ్యాపారులు బండి దత్తు తదితరులున్నారు.

క్యూరియాసిటీ సైన్స్ కిట్పై కార్యశాల


కేజీబీవీలో అవగాహన కల్పిస్తున్న వేణుశర్మ

కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ కేజీబీవీ పాఠశాలలో సీసీఎల్(సెంటర్ ఫర్ క్రియేటివ్ లర్నింగ్) ఐఐటీ గాంధీనగర్ గుజరాత్ నుంచి పంపిన క్యూరియాసిటీ సైన్స్ కిట్ వర్క్షాప్ను జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి వేణుశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో సీడీ విజిల్, యాంటి గ్రావిటీ టన్నెల్, భౌతిక రసాయన శాస్త్రంలోని వివిధ అంశాలపై రిసోర్స్ పర్సన్లు ప్రవీణ్కుమార్, టి శ్రీనివాస్, ఎన్ శ్రీనివాస్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని 20 కేజీబీవీ పాఠశాలలోని భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి


కుట్టుమిషన్లు అందజేస్తున్న సత్యం

రామారెడ్డి : విశ్వహిందూ పరిషత్ కామారెడ్డి సేవ విభాగం ఆధ్వర్యంలో రామారెడ్డి గ్రామంలో కుట్టు మిషన్లో శిక్షణ పొందిన 30 మహిళలకు గురువారం భాగ్యనగర క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మల సత్యం సర్టిఫికెట్లను అందజేశారు. ఈసందర్భంగా గుమ్మల సత్యం మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. భవిష్యత్తులో మాతృమూర్తుల కోసం వివిధ రకాల శిక్షణలను రామారెడ్డి కేంద్రంగా నిర్వహిస్తామన్నారు. అఖిల భారతీయ జనహిత సేవ ట్రస్ట్ ప్రముఖ్ ఉమాదేవి, ప్రాంత సేవా ప్రముఖ్ రాజేందర్, జిల్లా అధ్యక్షులు నిత్యానందం, ఉపాధ్యక్షులు గంగారెడ్డి, జిల్లా కార్యదర్శి బొల్లి రాజు, సహకార్యదర్శి దరి, జిల్లా సేవా ప్రముఖ్ అజయ్, దుర్గా వాహిని జిల్లా సహసంయోజిక భవాని, విశ్వహిందూ పరిషత్ రామారెడ్డి ప్రఖండ అధ్యక్షులు, తదితరులున్నారు.

వన్యప్రాణులకు నీటి సౌకర్యం

మాచారెడ్డి : వన్యప్రాణుల దాహం తీర్చడానికి అటవీశాఖ ఆధ్వర్యంలో గురువారం ఘన్పూర్(ఎం) అటవీ ప్రాంతంలో అధికారులు సాసర్పిట్లు ఏర్పాటు చేసి నీటిని నింపారు. ఈ సందర్భంగా మాచారెడ్డి డిప్యూటీ రేంజ్ అధికారి రమేశ్ మాట్లాడుతూ.. వన్యప్రాణులకు నీరు దొరక్క గ్రామాలకు వచ్చి చనిపోకుండా నీటిని నింపినట్లు తెలిపారు.

జుక్కల్ నియోజకవర్గానికి కోట్ల నిధులు

- ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు
- పలు చోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం


పిట్లంలో మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు


బిచ్కుందలో సీసీ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బిచ్కుంద/పిట్లం/నిజాంసాగర్ (జుక్కల్): అన్ని రంగాల్లో వెనకబడి ఉన్న జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వం కోట్ల నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అన్నారు. గురువారం బిచ్కుందలో సీసీ రోడ్ల పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరానికి సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం కోసం రూ.18 కోట్లు తెచ్చానన్నారు. బిచ్కుంద మండలానికి రూ.4 కోట్లు నిధులతో పనులు చేపడుతున్నామన్నారు. గ్రామాలలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు పనులు కొనసాగుతున్నాయన్నారు. పిట్లం మండల పరిషత్ కార్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్ సౌజన్యంతో ఎస్సీ నిరుద్యోగ మహిళలకు కుట్టు మిషన్లను ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు పంపిణీ చేశారు. మండలంలోని హస్నాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి, పిట్లం మండలంలోని ఎంఎం కాలనీలో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు రాణించాలని ప్రభుత్వం ఆడబిడ్డలకు అండగా ఉంటూ ప్రోత్సహిస్తుందన్నారు. జుక్కల్ క్యాంపు కార్యాలయంలో అన్ని మండలాల, అన్ని శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రాజీవ్ యువ వికాసం రుణాలు ప్రతి ఒక్కరికి అందేలా అధికారులు బాధ్యత వహించాలన్నారు. రాజీవ్ యువ వికాసం రుణాలపై జోరుగా ప్రచారం చేయాలన్నారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జుక్కల్ మండలంలోని దోస్త్పల్లి, కేంరాజ్ కల్లాలి, వజ్రఖండి,ఖండేబల్లూర్, సవర్గావ్,దోస్తపల్లి,పెద్ద ఎడిగి, చండేగావ్ గ్రామాలకి చెందిన బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో పిట్లం,బిచ్కుంద మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలలో అధిక భాగం మహిళలకే


ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్మోహన్రావు

- ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలి
- ఎమ్మెల్యే మదన్మోహన్రావు

ఎల్లారెడ్డి: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో అధిక భాగం మహిళలకే కేటాయించిందని ఎమ్మెల్యే మదన్మోహన్రావు అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎల్లారెడ్డి, లింగంపేట, నాగిరెడ్డిపేట మండలాల మహిళా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళలకు వ్యాపార రంగాలలో రాణించేందుకు స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందిస్తుందన్నారు. మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి తనహయాంలో జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రజిత, ఎల్లారెడ్డి, లింగంపేట, నాగిరెడ్డిపేట మండలాల మహిళా అధ్యక్షురాల్లు వాసవి, స్వరూప, జిల్లా మహిళా కార్యదర్శి అరుణ, మండల పార్టీల అధ్యక్షులు సాయిబాబా, నారాగౌడ్, శ్రీధర్గౌడ్, ఎల్లారెడ్డి పట్టణ అధ్యక్షులు వినోద్గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్లు కుడుముల సత్యనారాయణ, పద్మశ్రీకాంత్, సామెల్, వెంకట్రాంరెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్గౌడ్ తదితరులున్నారు.

భవన నిర్మాణ కార్మికుల భవనం ప్రారంభం..

పట్టణంలో భవన నిర్మాణ కార్మికుల భవనాన్ని ఎమ్మెల్యే మదన్మోహన్రావు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు భవన నిర్మాణ కార్మికుల కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలను అందిస్తున్నదన్నారు. కార్యక్రమంలో సాయిబాబా, లక్ష్మణ్ తదితరులున్నారు. పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎల్ఈడీ లైట్లను ఎమ్మెల్యే మదన్మోహన్రావు ప్రారంభించారు. పట్టణంలో సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు నూతనంగా ఎల్ఈడీ లైట్లను అమర్చారు. ఎల్ఈడీ లైట్లతో వెలుగులు విరజిమ్ముతాయని ఎమ్మెల్యే అన్నారు.



వానర యుద్ధం

నిజాంసాగర్(జుక్కల్): కామారెడ్డి జిల్లా మహమ్మద్ నగర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద గురువారం మధ్యాహ్నం రెండు గంటల పాటు వానరాల యుద్ధం బీభత్సం సృష్టించింది. గుంపులుగా ఉన్న వానరాలు గ్రూపులుగా విడిపోయి ఒకదానిపై ఒకటి తీవ్ర స్థాయిలో కలబడ్డాయి. రోడ్డుపై వానరాల యుద్ధంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. వాటి అరుపులు, దాడులతో అక్కడి వాతావరణం దద్దరిల్లిపోయింది.

బడ్జెట్లో విద్యా, వైద్య రంగాలను విస్మరించారు


మాట్లాడుతున్న డీఎస్పీ నాయకులు

కామారెడ్డి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్లో విద్యా, వైద్య రంగాలను విస్మరించారని ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ) జిల్లా కన్వీనర్ బొలేశ్వర్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విద్యకు 7శాతం, వైద్యంకు 5శాతం నిధులు కేటాయించడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, అరవింద్, రాజు, పర్శరాములు, సాయి, రాజలింగం తదితరులున్నారు.

క్రైం కార్నర్

హత్య కేసులో ఒకరి రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరేశ్

బిచ్కుంద(జుక్కల్): హత్య కేసులో ఒకరిని రిమాండ్కు తరలించినట్లు సీఐ నరేశ్ తెలిపారు. బిహార్కు చెందిన మనీష్ కుమార్, కుమార్లు మండలంలోని హజ్గుల్లో కూలీ పని చేస్తున్నారు. తన భార్యతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడనే అనుమానంతో మనీష్ను గతేడాది సెప్టెంబర్ 25న కుమార్ హత్య చేసి పరారయ్యాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో గురువారం యజమాని వద్ద జీతం డబ్బులు తీసుకునేందుకు వచ్చిన కుమార్ను పట్టుకున్నామన్నారు. మనీష్ను హత్య చేసినట్లు విచారణలో ఒప్పుకోవడంతో కుమార్ను రిమాండ్కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సై మోహన్రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

దొంగలను పట్టుకున్న గ్రామస్తులు

ఎడపల్లి (బోధన్): ఎడపల్లి మండలం ఠాణాకలాన్ గ్రామస్తులు గురువారం ముగ్గురు మహిళా దొంగలను పట్టుకున్నారు. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఠాణాకలాన్కు చెందిన గిర్మారెడ్డి 15 రోజుల క్రితం ఇంటికి తాళం వేసి నిజామాబాద్లో ఉంటున్న తన కొడుకు వద్ద వెళ్లారు. గురువారం మధ్యాహ్నం చిత్తు కాగితాలు సేకరించేందుకు రెండు ఆటోల్లో వచ్చిన ఐదుగురు మహిళలు గిర్మారెడ్డి ఇంట్లోకి వెళ్లారు. చోరీ చేసిన సామగ్రిని మొదట ఒక ఆటోలో తరలించగా, మరో ఆటోలో మిగతా సామగ్రి తరలిస్తుండగా కాలనీవాసులు ముగ్గురు మహిళలను పట్టుకున్నారు. మరో ఇద్దరు మహిళలు అక్కడి నుంచి పరారయ్యారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మహిళలను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన మహిళల్లో ఇద్దరు బోధన్, ఒకరు రుద్రూర్కు చెందిన వారిగా గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీచందర్ రెడ్డి తెలిపారు.

సబ్స్టేషన్లో మంటలు


సబ్స్టేషన్లో చెలరేగుతున్న మంటలు

మాచారెడ్డి : పాల్వంచ మండలం ఫరీద్పేట గ్రామంలోని 33/11 కేవీ సబ్స్టేషన్లో గురువారం మంటలు చెలరేగాయి. వెంటనే తేరుకున్న సిబ్బంది సరఫరాను నిలిపివేసి మంటలను ఆర్పారు. ఎండవేడిమికి కెపాసిటర్లు కాలిపోవడంతో మంటలు అంటుకున్నట్లు విద్యుత్ సిబ్బంది తెలిపారు. అనంతరం కెపాసిటర్కు మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఫైనాన్స్ కార్యాలయానికి నిప్పు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో జక్సాని శ్రీహరికి చెందిన ఫైనాన్స్ కార్యాలయ తలుపులకు బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. గమనించిన స్థానికులు యజమానికి సమాచారం అందించి మంటలను ఆర్పివేశారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు. కాగా, ఇదే కాలనీలో గతంలో ఓ ఇంట్లో బంగారు ఆభరణాలు అపహరించి దుండగులు బట్టలకు నిప్పు పెట్టి పారిపోయారు. మరోసారి అదేవిధంగా జరగడంతో కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు.

కిరాణా దుకాణం దగ్ధం

మాక్లూర్: మండలంలోని మదన్పల్లి గ్రామంలో గురువారం తెల్లవారుజామున ఓ కిరాణా దుకాణం కాలిబూడిదైంది. మదన్పల్లికి చెందిన అమ్ముల నాగరాజు జీవనోపాధి కోసం నెల రోజుల క్రితం గ్రామంలో ఓ మడిగెను అద్దెకు తీసుకొని కిరాణా దుకాణం నడుపుతున్నాడు. గురువారం దుకాణం పూర్తిగా దగ్ధం కాగా, అందులో ఉన్న సుమారు రూ.2 లక్షల విలువజేసే సరుకులు కాలిబూడిదయ్యాయి. విద్యుదాఘాతంతో జరిగిందా? ఎవరైనా నిప్పు పెట్టారా? అనేది తెలియడం లేదని బాధితుడు పేర్కొన్నాడు. ఈ విషయమై తహసీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేశామని నాగరాజు తెలిపారు.

పోలీసుల పేరిట డబ్బులు వసూలు.. యువకుడి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై సాయన్న

రెంజల్(బోధన్): టాస్క్ఫోర్స్ పోలీసునంటూ ఓ వ్యక్తిని బెదిరించి డబ్బులు వసూలు చేసిన యువకుడిని గురువారం అరెస్టు చేసి రిమాండ్కు తరలించినట్లు రెంజల్ ఎస్సై సాయన్న తెలిపారు. ఈ నెల 17న నిజామాబాద్కు చెందిన రఫీక్ అనే వ్యక్తి తన ఆటోలో ధర్మాబాద్కు నూకలు, బియ్యం తరలిస్తున్నాడు. రెంజల్ మండలం కందకుర్తి బ్రిడ్జి వద్ద అదే గ్రామానికి చెందిన తానాజీ సతీశ్ తాను టాస్క్ఫోర్స్ పోలీసునంటూ ఆటోను ఆపాడు. రఫీక్ను బెదిరించి తనకు డబ్బులు ఇవ్వకపోతే ఆటోను సీజ్ చేస్తాననడంతో బాధితుడు రూ. 3 వేలు ఫోన్ పే చేశాడు. ప్రతినెలా రూ. 5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేయగా రఫీక్ అంగీకరించి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. చివరికి అనుమానం వచ్చి డయల్ 100కు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు డబ్బులు వసూలు చేసిన సతీశ్ ఓ యూట్యూబ్ చానల్లో విలేకరిగా పనిచేస్తున్నట్లు గుర్తించి రిమాండ్కు తరలించారు.

భిక్కనూరులో ఇద్దరిపై కేసు

భిక్కనూరు: విలేకరుల ముసుగులో డబ్బులు డిమాండ్ చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన లింగాల నవీన్ గౌడ్, అర్జున్ విలేకరులమంటూ డబ్బులు డిమాండ్ చేశారని భిక్కనూరులోని సిద్ధిరామేశ్వర మోటార్ షాపు యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఇసుక తరలిస్తున్న వాహనాల సీజ్


పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

మాచారెడ్డి : పాల్వంచ మండల కేంద్రంలో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న లారీ, రెండు ట్రాక్టర్లను మాచారెడ్డి పోలీసులు గురువారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై అనిల్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మోపాల్లో పొక్లెయిన్, ట్రాక్టర్..

మోపాల్ : మండలంలోని బాడ్సి గ్రామ వాగులోంచి అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్న పొక్లెయిన్, ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ గురువారం తెలిపారు. బుధవారం అర్ధరాత్రి వాగులో ఇసుక తవ్వుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు పట్టుకొని ఆరుగురిపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

రుద్రూర్లో రెండు టిప్పర్లు..

రుద్రూర్: మండలంలోని లక్ష్మీపూర్ క్యాంపు శివారులో బుధవారం రాత్రి రెండు ఇసుక టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో టిప్పర్లను పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు.